

# గాయపడిన ధ్యేయం

కడుపులో కాళ్ళు పెట్టుకొని చాప మీద పడుకొని ఆలోచిస్తున్న 'పల్లవి' కడుపులో గురగుర మంటూ ఆకలి శబ్దాలు వినిపిస్తున్నాయి. ఏడో తరగతి పరీక్షలుకాగానే తల్లి చనిపోయింది. వ్యవసాయం తప్ప మరో విషయం తెలియని మోటు తండ్రికి తన చదువు కోరిక గురించి ఎంత చెప్పినా వినిపించుకోలేదు. పండుగ మార్చి పండుగకు మాత్రమే స్నానం చేసే తండ్రి దగ్గర కంపుకొట్టింది. మాసిపోయిన గళ్ళ లుంగీ, కావిరంగు కోరా గుడ్డతో కుట్టిన బనీను ఆయన మొరటుతత్వాన్ని చెప్పకచెబుతున్నాయి.

పైగా, ఎతీమతపు మేనత్త కొడుకుతో తన పెళ్ళి ఖరారు చేశాడు. చాదస్తపు నానమ్మ కూడా నాన్నను బలపరచడంతో, ఆలస్యం మంచిది కాదని భావించి ఎవరికీ చెప్పకుండా అర్థరాత్రి గడపదాటి రైలెక్కి విజయవాడకు చేరుకొంది. చిన్ననాటి స్నేహితురాలు 'కీర్తి' సహకారంతో చిన్నపాటి పార్ట్‌టైం ఉద్యోగం సంపాదించి ఇంటర్‌లో చేరింది – చిన్న గది అద్దెకు తీసుకొని, స్వయంపాకం చేసుకొని తింటున్నది

ప్రతి నెలా చివరివారంలో డబ్బు ఇబ్బంది కారణంగా, ఆకలిపోరాటం అలవాటే కావడంతో పెద్దగా అనిపించలేదుగాని, ఫైనలియర్ ఎగ్జామ్ ఫీజు కట్టేందుకు చివరిరోజు రేపే కావడం ఆమెను ఆందోళనకు గురిచేస్తోంది.

ఓ మొండిఘటంతో పెళ్ళి తప్పించుకొనేందుకు ఇల్లొదిలి పారిపోయి వచ్చి రెండేళ్ళయిపోయింది. ఇప్పుడు తిరిగి వెళ్ళి తండ్రిని ఫీజుకోసం డబ్బు అడగాలంటే మనస్కరించడం లేదు. అలాగని ఫీజు కట్టలేక పూర్తి సంవత్సరం చదువు వృధా చేసుకునేందుకు కూడా సిద్ధంగా లేదు. అందుకే ఇక తప్పదన్నట్లుగా, నిశ్చితాభిప్రాయంగా లేచింది 'పల్లవి'. ఫస్టియర్ నోట్‌బుక్స్ కొట్టుకేసి, రైలు ఛార్జికి డబ్బులు సరిచూసుకుంది.

మురుక్కాలువలో మునిగి తేలిన వీధి కుక్క వళ్ళు విదిల్చింది. 'పల్లవి' ఒంటి మీద మాసిన 'ఓణీ'మీద పడిన మురికి బట్టలు చిన్నతనంలో 'అమ్మ చెప్పిన మూలిగే నక్క మీద తాటిపండు' సామెతను గుర్తుకు తెప్పించాయి.

గంటన్నర ప్రయాణం తరువాత రైలు దిగింది పల్లవి. రెండేళ్ళ తరువాత ఆకలికడుపుతో సొంత వూరొచ్చి ఫీజు డబ్బుల నిమిత్తం ఇంటికెళ్ళిన 'పల్లవి' దిగ్భ్రమచెందింది. ఆ ఇల్లు అమ్మ బ్రతికున్నప్పటి ఇల్లులా లేదు. డాబామీద మరో అంతస్తులేచింది. ఇల్లంతా దూరపు బంధువుల హడావుడితో నిండివుంది. ఆకలిని అదిమిపెట్టి, ధైర్యాన్ని కూడగట్టుకొంటూ నెమ్మదిగా తండ్రిదగ్గరకెళ్ళింది. ఆశ్చర్యం! తండ్రి మురికివాసన కొట్టే గళ్ళలుంగీ, మాసిన బనీనుకు బదులు, జీన్స్ ఫాంటు, లూజ్ కాటన్ షర్ట్ టక్‌చేసుకుని చేతిలో సిగరెట్‌తో చాలా ట్రిమ్‌గా కనిపించాడు. ఆయన దగ్గర సెంటు వాసన గుభాళిస్తోంది.

'పల్లవి'ని చూడగానే ఆయన కళ్ళు ఎరుపెక్కాయి. మదురు చిట్లిస్తూ, "ఏం, ఎందుకొచ్చావ్, ఎప్పుడో చచ్చుంటావను కొన్నాం" అంటూ ఆవేశంగా అరిచాడు.

అప్పుడే అక్కడకు వచ్చిన నానమ్మ రాగాలు తీస్తూ "అయ్యో, నీవూ ఇప్పుడే వచ్చావా? ఇంతకాలం ఎక్కడుండిపోయావు, "లక్షణంలాంటి నా కొడుక్కి ఎన్ని కష్టాలొచ్చిపడ్డాయి", అంటూ రాగాలు తీసింది.

కడుపులోని ఆకలి బాధకంటే, పరీక్ష ఫీజుకట్టేందుకు డబ్బులేక సంవత్సరం చదివిన చదువు వృధా అవుతుందన్న దిగులుకంటే తన పెద్దవాళ్ళనోట వెలువడుతున్న వాగ్బాణాలకే మనసుకు తీవ్ర గాయాలయ్యాయి.

కాని, నానమ్మ అదేమీ పట్టించుకోకుండా, "ఎందుకే తల్లీ, అలా బొమ్మలా ఇక్కడే నుంచుండిపోయావు, వాళ్ళొచ్చే వేళయింది, కార్యక్రమం పూర్తై వాళ్ళు తిరిగివెళ్ళేవరకు వాళ్ళ కంట పడకుండా, 'సుందరమ్మ' గారి ఇంటి దగ్గర తలదాచుకో, తరువాత మాట్లాడుకుందాంగాని! అంటూ దాదాపు ఈడ్చుకెళుతున్నట్టే తన చేయి పట్టుకొని వీధివైపు దారితీసింది.

'పల్లవి'కి అక్కడే అసలువిషయం తెలిసింది. – తన స్నేహితురాలు రజని ద్వారా! నాన్నగారికి రజనీని ఇచ్చి చేసేందుకు సుందరమ్మ అంగీకరించిందట. కాని అది బావిలో దూకి చస్తానని బెదిరించడంతో మామకొందట. అయితే, ఈ రోజు మరో కొత్త సంబంధంవారు నాన్నగారి పెళ్లి చూపుల కొస్తున్నారట. అప్పటివరకూ అర్థంకాని ఆ ఆకలి మనసుకు అప్పుడే తెలిసిన వాస్తవం – నాన్నగారిని చూసేందుకు మరో పెళ్లికూతురు తరపు వారొస్తున్నారని!

గడప దాటిన తన ధ్యేయం గడప లోపలికొచ్చి గాయంగా మారిందని!!

తన పరీక్ష ఫీజు కోసం అమ్ముకునేందుకైనా అందుబాటులో లేని మరణించిన తన కన్నతల్లి పెళ్లి చీర సాక్షిగా!!!

–చంద్రశిల్ప, తెనాలి.